ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

గురువారం 13 జూన్ 2024


సీఎంగా ప్రమాణం చేస్తున్న చంద్రబాబునాయుడు



చంద్రుడి పట్టాభిషేకానికి..

ప్రభంజనం

- కేసరపల్లికి భారీగా కూటమి శ్రేణులు
- కార్యకర్తలతో కిక్కిరిసిన.. ఎన్‌హెచ్ - 16

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం): చంద్రుడి పట్టాభిషేకానికి జన ప్రభంజనం తోడైంది. ప్రమాణ స్వీకారమహోత్సవానికి ఊరూ వాడా ఏకమై కేసరపల్లికి కదలి వచ్చింది. ప్రమాణస్వీకారం ముగిసే వరకు కూడా ప్రజలు ప్రవాహంలా వస్తూనే ఉన్నారు. తొక్కిసలాటలకు ఆస్కారం లేకుండా జాతీయ రహదారిపై పోలీసు లు బారికేడ్లు ఏర్పాటు చేసి నిలువరించే ప్రయత్నం చేసినా.. తమ అభిమాననేతను చూడనివ్వరా అంటూ వాటిని తోసుకుని మరీ చొచ్చుకు వచ్చారు. అరలక్ష మందికి మాత్రమే గ్యాలరీలు ఏర్పాటు చేసినా.. మరో లక్ష మంది జనం అదనంగా తరలి వచ్చారు. వచ్చేవాళ్ళు, వెళ్ళేవాళ్ళతో జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 16 రద్దీగా మారిపోయింది. పాస్‌లున్న వీవీఐపీలు, వీఐపీలు గ్యాలరీల్లో కూర్చునే అవకాశం దక్కలేదు. అయినా తమ అభి మాన నేత కోసం నుంచుని ఎల్‌ఈడీ స్ర్కీన్ల మీద వీక్షించారు. ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షిం చటం సాధ్యం కాని వారంతా జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్లపై కార్యక్ర మాన్ని వీక్షించారు. ప్రతి ఎల్‌ఈడీ స్ర్కీన్ దగ్గర టెంట్లు ఏర్పాటు చేయటంతో ప్రజలు అక్కడే కూర్చుని ప్రమాణ స్వీకారం ఆద్యంతం వీక్షించారు. ఎల్‌ఈడీ స్ర్కీన్ల దగ్గర ఉన్న జనాలు కూడా మినీ సభలను తలపించాయి.


తుళ్లూరు శిబిరం వద్ద మహిళల సంబరాలు


గన్నవరం వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

అమాత్యులయ్యారు..

- మూడు జిల్లాలు.. నలుగురు మంత్రులు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ముగ్గురికి చోటు
- బాపట్ల జిల్లా నుంచి గొట్టిపాటి రవికి అవకాశం
- ఊరూ వాడా ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలు

..అనే నేను అంటూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకారాలను జిల్లావ్యాప్తంగా తిలకించిన కూటమి శ్రేణుల, సామాన్య ప్రజల సంబరాలు అంబరాన్ని అంటాయి. తొలుత చంద్రబాబు అనంతరం మంత్రులు కృష్ణా జిల్లా కేసరపల్లిలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అదే సమయంలో ప్రమాణ స్వీకారోత్స వాన్ని ప్రజలు తిలకించేందుకు ఎక్కడికక్కడ ముఖ్య కూడళ్లలో ప్ర భుత్వం ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా తమ నేతల ప్రమాణ స్వీకారాలను కేరింతలు కొడుతూ తిలకించారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ముగ్గురికి, బాపట్ల జిల్లా పరిధి నుంచి ఒకరికి మంత్రి వర్గంలో చోటుదక్కింది. టీడీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యే లుగా గెలిచిన లోకేశ్(మంగళగిరి) అన గాని సత్య ప్రసాద్ (రేపల్లె), గొట్టిపాటి రవికుమార్(అద్దంకి), జనసేన నుంచి పోటీ చేసిన నాదెండ్ల(తెనాలి)లను చంద్రబాబు తన మంత్రి వర్గంలో చేర్చుకున్నారు. వీరి చేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అదే సమయంలో వారివారి నియోజక వర్గాలతో పాటు జిల్లా వ్యాప్తంగా కూటమి శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు కూడా మిఠాయిలు పంచుకుని టపాకాయలు కాల్చి ఆనందో త్సాహాలు ప్రదర్శించారు. తమ నేతల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని మంత్రుల అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

మంగళగిరి, రేపల్లె / గుంటూరు, బాపట్ల, తెనాలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మంత్రి వర్గంలోకి గుంటూరు నుంచి ఇద్దరు, బాపట్ల జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. మొత్తంమీద మూడు జిల్లాలు నలుగురికి మంత్రి పదవులు దక్కాయి. కృష్ణా జిల్లా కేసరపల్లి వేదికగా వీరింతా బుధవారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అదే సమయంలో ఆయా నియోజకవర్గాలతో పాటు జిల్లా వ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. గత టీడీపీ ప్రభుత్వంలో లోకేశ్ మంత్రి పదవిని చేపట్టారు. ప్రజాక్షేత్రంలో గెలవాలన్న ఆయన కలను మంగళగిరి వాసులు ఈ సారి నెరవేర్చారు. అత్యధిక మెజార్టీతో గెలిచిన లోకేశ్‌ను చంద్రబాబు మంత్రిగా ఎంపిక చేశారు. సామాజిక సమీకరణలో భాగంగా బీసీలకు పెద్ద పీట వేయాలని చంద్రబాబు భావించడంతో అనూహ్యంగా అనగాని సత్యప్రసాద్‌ను అదృష్టం వరించింది. సత్యప్రసాద్ రేపల్లె ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. వరుసగా ఐదుసార్లు గెలిచి ఓటమెరుగని నేతగా గుర్తింపుపొందిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కష్టాన్ని గుర్తించిన చంద్రబాబు ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. వీరిద్దరూ కూడా మంత్రి పదవులు పొందడం తొలి సారి కావడం విశేషం. చంద్రబాబు నూతన మంత్రివర్గంలో తెనాలికి ప్రాధాన్యం ఇచ్చారు. మంత్రివర్గంలో జనసేన నుంచి ముగ్గురికి చోటు ఇవ్వగా వారిలో నాదెండ్ల మనోహర్ ఒకరు. మొదటి నుంచి మంత్రివర్గంలో మనోహర్‌కు స్థానం ఉంటుందన్న ఊహాగానాలు రాగా, దానిని నిజం చేస్తూ చంద్రబాబు అవకాశం కల్పించారు. 1983లో వేమూరు నుంచి గెలుపొందిన నాదెండ్ల భాస్కరరావుకు ఎన్టీఆర్ కేబినెట్‌లో కీలక మంత్రిగా వ్యవహరించే అవకాశం దక్కగా నాలుగు దశాబ్దాల తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేసే అవకాశం ఆయన తనయుడు మనోహర్‌కు దక్కింది.



లోకేశ్.. రెండో సారి..ఎన్నో లక్ష్యాలు

మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలను చేపట్టడం ఇది రెండోసారి. మంగళగిరి నుంచి ఎమ్మెల్యేలుగా మంత్రి పదవులు నిర్వహించిన వారిలో లోకేశ్ మూడో వ్యక్తి. లోకేశ్ 2016లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖమంత్రి శాఖలను నిర్వహించారు. మంగళగిరిలో ఐటీ పార్కును ఏర్పాటు చేయించి కొన్ని ఐటీ పరిశ్రమలను మంగళగిరి, గన్నవరం ప్రాంతాలకు తీసుకొచ్చారు. మంగళగిరిని ఐటీ హబ్‌గా, మరో గచ్చిబౌలిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేశారు. మంగళగిరి నియోజకవర్గంపై అవగాహన ఏర్పాటు చేసుకున్న లోకేశ్ దేశంలోనే మంగళగిరిని ఓ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన మంత్రి కావడం మంగళగిరి ప్రజల అదృష్టంగానే భావించాలి. లోకేశ్.. తనకు 53,350 ఓట్ల మెజారిటీ కావాలని అభ్యర్థించగా 91,500 ఓట్ల రికార్డు మెజారిటీని ఇచ్చి ఘనంగా ఆశీర్వదించారు. దీంతో మంగళగిరి అభివృద్ధిపై లోకేశ్ పట్టుదల మరింతగా పెరిగింది. మంగళగిరిలో సాధ్యమైనన్నీ ఐటీ పరిశ్రమలను నెలకొల్పడంతో పాటు ఇతర ఉపాధి పరిశ్రమలను ప్రోత్సహించాలని లోకేశ్ భావిస్తున్నారు. మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా మార్చి వేలాదిమంది స్వర్ణకారులకు చేతినిండా పని కల్పించేలా చర్యలు చేపట్టనున్నారు. చేనేత ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మంచి ప్రాచుర్యాన్ని తీసుకురావడంతోపాటు మరిన్ని వీవర్స్‌శాలలను స్థాపించి నేతన్నలను అన్నీవిధాలుగా ఆదుకునేందుకు కార్యాచరణను చేపట్టారు. మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి దేవస్థానాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకుంటున్నారు.



నాడు స్పీకర్.. నేడు మంత్రిగా నాదెండ్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభాపతిగా చేసిన నాదెండ్ల మనోహర్‌కు నూతన మంత్రివర్గంలో మంత్రిగా పదవి లభించింది. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కుమారుడైన మనోహర్ రాజకీయ పరంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెనాలి నుంచి మూడోసారి విజయం సాధించిన మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌కు మంత్రిగా అవకాశం దక్కటంతో తెనాలిలో ఆనందం వెల్లువెత్తుతోంది. 2004 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మనోహర్ తొలిసారిగా 2004 ఎన్నికల్లో తెనాలి నుంచే కాంగ్రెస్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. 2009 లోనూ కంగ్రెస్ తరఫునే పోటీలో నిలిచి రెండోసారి కూడా విజయాన్ని దక్కించుకున్నారు. అప్పుడే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు స్పీకర్‌గా వ్యవహరించారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ఆయన అపజయం పొందారు. 2019 ఎన్నికల నాటికి జనసేనలో చేరి, పోటీలో నిలిచి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో కూటమి తరపున తెనాలి సీటును దక్కించుకున్న ఆయన గతంలో తెనాలి ఎన్నికల చరిత్రలో ఎవరికీ దక్కనంతగా 48,112 మెజారిటీ సాధించారు. తమ ఎమ్మెల్యే మంత్రి అయ్యారని అభివృద్ధి విషయంలో తెనాలి దశ మారిపోతుందన్న సంతోషంలో జనం ఉన్నారు. మనోహర్‌కు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే గోగినేని ఉమ శుభాకాంక్షలు తెలిపారు.





తీర ప్రాంతం నుంచి అనగానికి..

హ్యాట్రిక్ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు అమాత్య యోగం దక్కింది. బీఎస్సీ, కంప్యూటర్స్ చదివిన సత్యప్రసాద్ మాజీ ఆర్థిక మంత్రి అనగాని భగవంతరావు సోదరుడు రంగారావు కుమారుడు. తీర ప్రాంత నియోజకవర్గమైన రేపల్లె నుంచి సత్యప్రసాద్ 2014, 2019, 2024లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. బాపట్ల జిల్లా పరిధిలోనే అనగాని 40వేల పైచిలుకే అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించారు. సత్యప్రసాద్‌కు మంత్రిగా అవకాశం దక్కడంతో తీరప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019లో వైసీపీ సునామీలో కూడా రేపల్లె నుంచి ఆయన అత్యధిక మెజార్టీతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విజయకేతనం ఎగురవేశారు. తీర ప్రాంతంలో అప్పట్లో కూచినపూడి నుంచి టీడీపీ తరపున గెలిచిన ఈవూరి సీతారావమ్మ మంత్రి పదవి నిర్వహించగా ఆ తర్వాత కూటమి ప్రభుత్వంలో రేపల్లె నుంచి గెలిచిన సత్యప్రసాద్‌కు మంత్రి పదవి దక్కింది.

ఓటమెరుగని రవి.. మంత్రిగా..

ఓటమెరుగని నేతగా కీర్తి గడించిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తొలిసారిగా చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కింది. వైసీపీ హయాంలో ఆయనను రకరకాలుగా వేధించారు. క్వారీలు మూయించారు.. వందల కోట్ల జరిమానాలు విధించి కేసులు పెట్టారు.. పార్టీ మారాలని అనేక రకాలుగా ఒత్తిళ్లు పెట్టారు.. వైసీపీ వేధింపుల దాటికి పూర్తిగా వ్యాపారాల నుంచే తప్పుకునే పరిస్థితి రవికుమార్‌కు ఏర్పడింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్నింటినీ తట్టుకుని నిలబడ్డారనే పేరును అటు కార్యకర్తల్లోనూ, ఇటు పార్టీ అధినేత దగ్గర రవికుమార్ తెచ్చుకోగలిగారు. గొట్టిపాటి కష్టాన్ను గుర్తించిన చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టారు. అద్దంకి నుంచి గొట్టిపాటి వరుసగా ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో మార్టూరు నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గొట్టిపాటి అసెంబ్లీలో అడుగుపెట్టారు. నియోకవర్గాల పునర్విభజన అనంతరం అద్దంకి నుంచి 2009, 2014, 2019, 2024లో గెలుపొందారు.

ఊరంతా.. ఉత్సాహం

- సంబరాల్లో మునిగి తేలిన ప్రజలు

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం ఉరంతా పండుగలా జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు సంబరాలు చేసుకున్నారు. యువకులు ద్విచక్ర వాహనాలతో సందడి చేశారు. కేసరపల్లి వెళ్లలేని వారి కోసం అనేక ప్రాంతాల్లో భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయగా వేలాదిమంది కార్యకర్తలు, ప్రజలు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించారు. అక్కడే సంబరాలు చేసుకున్నారు. ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు. చాలా చోట్ల మధ్యాహ్నా విందు క్యాక్రమాలు చేపట్టారు. కాగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వేలాది వాహనాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ప్రమాణ స్వీ కార కార్యక్రమానికి కేసరపల్లికి తరలి వెళ్లాయి. దీంతో కాజ టోల్‌గేటు వద్ద, తాడే పల్లి వారధి వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచి పోవడంతో ముందుకు వెళ్లే అవకాశం లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. రాజధాని గ్రామాల్లో మహిళలు, రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తుళ్లూరు, మందడం దీక్షా శిబిరాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్ల వద్ద చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. చంద్రబాబు ప్రమాణం చేస్తున్న సమయంలో వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 'న్యాయం గెలి చింది.. అమరావతి నిలిచింది' అంటూ రోడ్ల మీదకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ అమరావతి ఇసుక పడవల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో వినూత్నంగా కృష్ణానదిలో పడవులతో ప్రదర్శన జరిగింది. చంద్రబాబు నిలువెత్తు కటౌట్, పవన్‌కళ్యాణ్, లోకేశ్ బ్యానర్లు, కూటమి పార్టీల జెండాలతో పడవులను అలంకరించిన పడవులతో మంతెన ఆశ్రమం నుంచి ప్రకాశం బ్యారేజి వరకు ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు రాకతో అమరావతి అభివృద్ధితోపాటు అందరికీ ఉపాధి లభిస్తుందని ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. పలు గ్రామాలు, పట్టణాల్లో కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని తమ నేతలకు మంత్రి పదవి రావడంపై ఆనందం వెలిబుచ్చారు. సైకో జగన్ పీడ రాష్ట్రానికి వదిలిందని పలువురు ఆనందాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



చిలకలూరిపేట : గంగమ్మ తల్లి దేవస్థానంలో మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ నాయకులు


చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కృష్ణానదిలో ఇసుక పడవల ర్యాలీలు


నరసరావుపేట టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్, జేసీ శ్యాంప్రసాద్


గురజాల చల్లగుండ్ల గార్డెన్స్‌లో ప్రమాణ స్వీకారం తిలకిస్తున్న ప్రజలు

సభా వేదిక వద్ద కోలాహలం







వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

పేదలకు.. ఆహా..రం

- పేదల ఆకలి తీర్చనున్న కూటమి ప్రభుత్వం
- అన్న క్యాంటీన్‌లను విధ్వంసం చేసిన వైసీపీ సర్కార్

నరసరావుపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు నాడు తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసింది. నిత్యం వందలాది మంది పేదల ఆకలిని తీర్చాయి. తెలుగేదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో అన్న క్యాంటీన్లకు పూర్వవైభవం రానుంది. అన్న క్యాంటీన్‌ల పురుద్ధరణ ఫైల్‌పై గురువారం సీఎం చంద్రబాబు సంతకం చేయనున్నారు. మళ్లీ పేదల కడుపు నింపడానికి సీఎంగా చంద్రబాబు రంగం సిద్ధం చేస్తున్నారు.

వైసీపీ అధికారం చేపట్టగానే కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పేదల నోటికి అందాల్సిన భోజనంను దూరం చేసింది. అన్న క్యాంటీన్ పథకాన్ని అటకెక్కించింది. వైసీపీ ప్రభుత్వం సాగించిన విధ్వంసం అన్న క్యాటీన్‌లను తాకింది. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను పాడుబెట్టింది. పేదల కడుపు నింపేందుకు ఉపయోగపడిన భవనాలు అధ్వానంగా మార్చేసింది. భవనాల నిర్వహణను సంబంధిత అధికారులు గాలికొదిలేశారు. వీటిలోని భోజన ఏర్పాటుకు వినియోగించే సామాగ్రి మాయమైంది. ప్రభుత్వం ఆస్తిని రక్షించాల్సిన అధికారులు మిన్నకున్నారు. భవనాలలో వ్యర్థాలు పెరుకుపోయాయి. క్యాంటీన్ భవనాలు కనిపించనంతగా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఆకలి తీర్చిన భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. క్యాంటీన్‌లను తెరవాలని తమ కడుపు నింపాలని పేదల మొరను వైసీపీ ప్రభుత్వం ఆలకించలేదు. అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరిస్తానని ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు పేదలకు హామీ ఇచ్చారు. ఈ హామీని అమలుకు చర్యలు చేపట్టారు. అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ ఫైల్‌పై సంతకం చేస్తుండటంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 30,238 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 30,471 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,608 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

గుంటూరు(విద్య), జూన్ 12: వేసవి సెలవుల అనతరం దాదాపు నెలన్నర తరువాత నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే తల్లిదండ్రులు విద్యార్థుల్ని పాఠశాలలకు పంపేందుకు సన్నద్ధం అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పంపిణీ చేసే విద్యాకానుక రవాణా పూర్తిచేశారు. మరోవైపు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను గుంటూరు గోరంట్లలోని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల డిపోనుంచి పంపిణీ చేశారు.

చంద్రబాబుతో నవ్యాంధ్రప్రదేశ్‌కు భరోసా: కన్నా

సత్తెనపల్లి, జూన్ 12: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబుతో నవ్యాంధ్ర ప్రదేశ్ భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణను బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలు గు ప్రజల సమగ్ర అభివృద్ధికి పునాది వేసిన నాయకుడు చంద్ర బాబు అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాల్గవసారి ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు నియోజక వర్గ ప్రజల తరఫున ఆ యన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు.పెండింగ్ ప్రాజెక్టులు పూర్తవుతాయన్నారు.

ప్రజలకు జగనాసురుడి నుంచి విముక్తి

- అమరావతి అభివృద్ధే ధ్యేయంగా పాలన
- సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తాం
- మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూన్ 12: రాష్ట్రప్రజలకు జగనాసురుడి నుంచి విముక్తి కలిగిందని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం మంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం తాడేపల్లిలోని ఆయన గృహంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన సాగిందని, సంక్షేమ పాలన పేరుతో పేదలను దోచేశారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చెయ్యకపోగా ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి కోట్లాదిరూపాయలు అప్పులు తెచ్చి జేబులు నింపుకున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళటంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో జగన్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. మంత్రి గొట్టిపాటి రవి మాట్లాడుతూ అమరావతి అభివృద్ధే ధ్యేయంగా నూతన ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఐదేళ్ళ వైసీపీ పాలనలో అమరావతి రాజధానిని అభివృద్ధి చెయ్యకపోగా మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టారన్నారు. టీడీపీ ప్రభుత్వం గెలవటంతోనే అమరావతి రాజధాని అభివృద్ధి పనలను ప్రారంభించటం జరిగిందన్నారు. జగన్ పాలనలో పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి తప్పుడు కేసులు పెట్టి హింసించారన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ని అమలు చెయ్యటంతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలకు ప్రతి సంవత్సరం మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో చేసిన మోసాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ప్రమాణస్వీకారం అనంతరం మాట్లాడుతున్న నూతన మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, పయ్యావుల కేశవ్

ఎమ్మెల్యేలకు ట్రాఫిక్ ఇక్కట్లు

చిలకలూరిపేట అర్బన్/ గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి అశేష జనవాహిని తరలిరావటంతో ప్రకాశం బ్యారేజీపై బుధవారం ఉదయం భారీగా ట్రాఫిక్ జామైంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గుంటూరు నుంచి బయల్దేరిన వారు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చాలాసేపు కారులోనే వేచి ఉన్నారు. ఇక చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కారు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకోయింది. దీంతో ఆయన స్థానిక కార్యకర్త సహాయంతో ద్విచక్ర వాహనంపై సభాస్థలికి చేరుకున్నారు. అయితే అప్పటికే ప్రమాణ స్వీకార ఘట్టం ముగియడంతో అందరికీ శుభాకాంక్షలు తెలిపి వెనుదిరిగారు.



స్కూటీ పై వెళుతున్న ఎమ్మెల్యే పుల్లారావు



ప్రకాశం బ్యారేజీ పై కారులోనే వేచివున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాష్ట్ర మంత్రి వర్గ కూర్పు అద్భుతం

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 12: అన్నీ వర్గాలకు న్యాయం చేస్తూ సామాజిక సమతూకం పాటిస్తూ, యువతరానికి పెద్దపీట వేసిన రాష్ట్ర మంత్రివర్గ కూర్పు అద్భుతంగా ఉందని టీడీపీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి మంత్రివర్గంలో 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించడాన్ని సాహసోపేతమైన నిర్ణయం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నిదర్శనం అని జీవీ అభివర్ణించారు. నవ్యాంధ్ర మూడవ ముఖ్యమంత్రిగా చంద్రబాబు క్యాబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారంతో పాటు అన్ని జిల్లాలు, అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు ప్రాధాన్యం లభించేలా మంత్రుల ఎంపికలో చంద్రబాబు జాగ్రత్తలు తీసుకున్నారని జీవీ కితాబిచ్చారు. సంక్లిష్ట సమయంలో రాష్ట్ర పునఃనిర్మాణం సవాళ్లను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంచుకున్న ఈ జట్టు.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథాన నిలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పిడుగు పాటుకు రైతు మృతి



సంకుర్రాతి రామస్వామి (పాత చిత్రం)

మాచవరం, జూన్ 12: పిడుగుపాటుకు రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో బుధవారం సాయం త్రం జరిగింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన సంకురాత్రి రామస్వామి (34) ట్రాక్టర్‌తో పొలం దున్నేందుకు పొలానికి వెళ్లాడు. పొలం దున్ను తున్న క్రమంలో వర్షం రావడంతో తలదాచుకునేందుకు చెట్టుకింద కు వెళ్తున్నాడు. అంతలోనే ఉరుములు, మెరుపులతో పెద్ద శబ్దం రావడంతో షాక్‌కు గురై అక్కడే కుప్పకూలిపోయాడు. ఆ సమయంలో పొలాల్లో వున్న ఇరుగుపొరుగు వారు చూసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొన ఊపిరితో వున్న రామస్వామిని గ్రామంలోకి తీసుకొస్తుండగా మృతి చెందినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. మృతునికి భార్య మల్లేశ్వరితో పాటు ఇద్దరు పిల్లలు వున్నారు. విషయం తెలిసిన బంధువులు, కుటుంబసభ్యులు బోరున విలపించసాగారు.

పలు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆగస్టు నెల 14, 15 తేదీల వర కు రద్దు చేసిన పలు రైళ్లను ఈ నెల 21వ తేదీ నుంచి పునరుద్ధరిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 21వ తేదీ నుంచి నెంబరు. 07628 విజయవాడ - గుంటూరు, నెంబరు. 07786 గుంటూరు - రేపల్లె, నెంబరు. 07873 రేపల్లె - తెనాలి, ఈ నెల 22 నుంచి నెంబరు. 07781 విజయవాడ - మాచర్ల, ఈ నెల 23 నుంచి నెంబరు. 07782 మాచర్ల - విజయవాడ రైళ్లను పునరుద్ధరిస్తున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి నెంబరు. 07874 తెనాలి - రేపల్లె, నెంబరు. 07875 రేపల్లె - తెనాలి, నెంబరు. 07876 తెనాలి - రేపల్లె, నెంబరు 07787 రేపల్లె - గుంటూరు, నెంబరు. 07887 గుంటూరు - తెనాలి, నెంబరు. 07888 తెనాలి - రేపల్లె రైళ్లను పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు ఈ నెల 24 నుంచి నెంబరు 07889 రేపల్లె - మార్కాపురం రోడ్డు, నెంబరు 07890 మార్కాపురం రోడ్డు - రేపల్లె, నెం బరు 07282 తెనాలి - గుంటూరు, నెంబరు 07864 గుంటూరు-విజయవాడ రైళ్లను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	147, 156,167
చికెన్ విత్ స్కిన్	284.00
చికెన్ స్కిన్ లెస్	294.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఆనందోత్సాహం వ్యక్తం చేస్తున్న క్రోసూరు విద్యానగర్ మహిళలు

క్రోసూరు: చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా క్రోసూరు మండలంలోని అన్నిగ్రామాల్లో కూటమి నేతల సంబరాలు మిన్నంటాయి. మండలంలోని ముఖ్య నాయకులకు పాసులతో కూడిన ఆహ్వానాలు అందటంతో సుమారు నాలుగు బస్సుల్లో టీడీపీ కూటమి నేతలు ప్రమాణ స్వీకారానికి తరలివెళ్ళారు. క్రోసూరు ఎస్సీ కాలనీలో ప్రమాణ స్వీకారం సందర్భంగా తెలుగు యువత నాయకులు కేక్ కట్ చేశారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాండ్రు కాశయ్య, టీడీపీ సీనియర్ నేత మన్నెం శ్రీనివాసరావు తదితరరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చిలకా శ్రీనివాసరావు, కొడవటి కిషోర్, దుద్దుల యోహాన్ తదితరులు పాల్గొన్నారు. క్రోసూరు విద్యా నగర్‌లో తెలుగు మహిళలు సంబరాలు జరుపుకున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రచారాన్ని తిలకిస్తూ మిఠాయిలు పంచుకున్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, పాల్ టెక్నిక్ కళాశాలలోని ఎల్‌ఈడీ స్క్రీన్ పై చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించారు.

పెదకూరపాడు: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారాన్ని చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద జరిగిన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారాన్ని తిలకించేందుకు పెదకూరపాడులోని శ్రీసాయి శ్రీనివాస్ కల్యాణ మండపంలో స్క్రీన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రమాణ స్వీకారాన్ని స్క్రీన్ పై చూసిన పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు బాణ సంచా పేల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెదకూరపాడు నియోజక వర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తెరలివెళ్ళారు. పెదకూరపాడు మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, టీడీపీ శాలివాహన సాధికార సమితి రాష్ట్ర ప్రతినిధులు మోదుగుల చంద్రశేఖర్, మండల తెలుగు యువత నాయకులు మక్కెన సాగర్, మండల టీడీపీ నేతలు పెనుముచ్చు రమేష్ తదితరులు వెళ్ళిన వారిలో ఉన్నారు.

మైనార్టీశాఖ మంత్రిగా మహమ్మద్ ఫరూక్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆ ప్రాంగణంలో పల్నాడు జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ మహమ్మద్ ఫరూక్‌ను కలసి అభినందనలు తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి పదవి ఇవ్వటం ఎంతో సంతోషంగా ఉందని ముంతాజ్ అన్నారు.

అచ్చంపేట: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల కేంద్రమైన అచ్చంపేటలో బుధవారం స్థానిక ముస్లిం యూత్ సభ్యులు, టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ తెలుగుదేశం పార్టీ వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎనిగండ్ల కోటయ్య, తాళ్ళూరి సుబ్బారావు, ఎస్కే కాసుల, ఎస్కే రహ్మాన్, సుభానీ, ఎస్కే మాబూ, సాంబశివుడు, చంటి, పాల్గొన్నారు.

అచ్చంపేట మండలంలోని పెదపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు పాటిబండ్ల బాపిరాజు ఆధ్వర్యంలో ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాటిబండ్ల బాపిరాజు, నెల్లూరి చిన వెంకటయ్య, నెల్లూరి వెంకటేశ్వర్లు, నల్లమోతు హరిబాబు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, పాటిబండ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

- కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో నేతల హర్షం
- ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీగా వెళ్లిన శ్రేణులు
- పసుపుమయంగా మారిన ప్రధాన రహదారులు
- ఎన్టీఆర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు

దుర్గి, జూన్ 12: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం అనంతరం బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు జిల్లా నలుమూలల నుంచి కూటమి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నేతలు సంబరాల్లో మునిగి తేలారు.



దుర్గిలో సంబరాలు జరుపుకుంటున్న కూటమి నేతలు

మండల కేంద్రమైన దుర్గిలోని ప్రధాన రహదారులు పసుపుమయంగా మారాయి. మండలంలోని కోలగుట్ల నుంచి సుమారు 50 ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. డీజే చప్పుళ్లతో బాణాసంచా కాల్చుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా తాము ఏ చిన్న కార్యక్రమం చేయాలన్నా భయంతో వణికిపోయే వాళ్లమని, కూటమి గెలుపుతో పూర్తి స్వేచ్ఛ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, మాగులూరి నారయ్య, గర్నీడి రమేష్, మన్నెయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ నేతలు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ యువ నేత బాబుఖాన్, ఎస్సీ సెల్ నేత పేరువాల పుల్లారావు ఆధ్వర్యాన బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో షేక్ ఇమ్రాన్, షేక్ బాషా, షేక్ నాగుల్‌మీరా, అశోక్, సమీర్ పాల్గొన్నారు.

విజయపురిసౌత్: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో మాచర్ల మండలం బ్రహ్మానందపురం తండాలో గిరిజనులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాండునాయక్, మల్లినాయక్, రవినాయక్, తర్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, బాలునాయక్, బీమ్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మిరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు జానీబాషా, ఆర్యవైశ్య సంఘ నేత ఇమ్మడి సాంబశివరావు, మైనార్టీ నేత షేక్ నన్నేసా, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఈడీల ద్వారా ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మహిళలు

పిడుగురాళ్ల: చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమ ఘట్టాన్ని గురజాల నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాల్లోని కమ్యూనిటీ హాల్స్‌లో ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేసి పొదుపు సంఘ మహిళలు, పార్టీ నేతలు, తెలుగు మహిళలు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. పిడుగురాళ్ల శుభమ్ కల్యాణ మండపం, మరో కల్యాణ మండపంలోనూ భారీ ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. కమిషనర్ గిరికుమార్, తహసీల్దార్ శ్యాంసుందర్, మెప్మా అధికారులు శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా పిడుగురాళ్ల నుండి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలివెళ్లారు.

దాచేపల్లి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమానికి దాచేపల్లి నుంచి కూటమి శ్రేణులు టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ భద్రి నాయకత్వంలో ఆర్టీసీ బస్సులలో తరలివెళ్లారు. వెళ్లినవారిలో డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, సొసైటీ నారాయణ, పగడాల భాస్కరరావు, శేషగిరిరావు, పుల్లయ్య, మాజీసర్పంచ్ వలి, నాయబ్ అబ్దుల్లా, కృష్ణ, తుల్లా, అహ్మదా, శ్రీనివాసరావు, శ్రీరాములు, నారాయణ, బాలాజీనాయక్, చుండు లింగయ్య, తదితరులున్నారు.

గురజాలటౌన్: చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు తిలకించేందుకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన బుధవారం పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో రెండు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. నేతల ప్రమాణ స్వీకారం అనంతరం టీడీపీ నేతలు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవల్లి బొల్లయ్య, ఎశరమాల హనుమంతురావు, జమ్మిగుంపుల నాగేశ్వరరావులు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే టీడీపీ నేత ఎన్ఆర్ కావూరి రామారావు సహకారంతో వృద్ధాశ్రమానికి నెలరోజులకు సరిపడా సరుకులు అందజేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి నేతలు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివెళ్లారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో బీజేపీ నేత లేళ్ల కృష్ణ ఆధ్వర్యాన బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

రెంటచింతల: సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం వేళ మండల టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఐదేళ్ల తర్వాత ప్రధాన రహదారిపై గులాంల్‌లు చల్లుకుంటూ బాణసంచా కాలుస్తూ ఎవరికి భయపడకుండా వీర విహారం చేశారు. ఒకరి నొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

అమరావతి: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించేందుకు మండల కేంద్రాలలో అధికారులు ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్, టీవీలు ఏర్పాటుచేశారు. మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్ ఆడిటోరియంలో టీవీని ఏర్పాటు చేసి మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అధికారులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొని తిలకించారు.కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణారావు, సిఐ బ్రహ్మం, ఆర్ఐ రాజశేఖర్, ఎస్ఐ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్తెనపలి : చంద్రబాబునాయుడు, ఇతర మంత్రివర్గ ప్రమాణ స్వీకారం సధ్భంగా పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం, కాకతీయ కల్యాణ మండపంలలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు వీక్షించారు. అనంతరం కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు.

సత్తెనపల్లి రూరల్: నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు, పార్టీ శ్రేణులు బుధవారం అత్యధిక సంఖ్యలో తిలకించారు. వారి స్వగృహాల్లోని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించగా కొన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు మైక్‌లను ఏర్పాటు చేసి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారాన్ని, ఆయన ప్రసంగాన్ని ప్రజలకు, పార్టీ శ్రేణులకు వినిపించారు. మండలంలోని చాలా గ్రామాల్లో చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా పెద్ద ఎత్తున బాణ సంచా పేల్చారు. డీజేపీలు పెట్టి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి కేక్‌తో పాటు స్వీట్లను పంపిణీ చేశారు.



సత్తెనపల్లిలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజలు

మాచవరం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుండి డ్వాక్రా మహిళలు, సిబ్బంది ఆర్‌టిసి బస్సుల్లో బుధవారం తరలివెళ్లారు. మండల కేంద్రమైన మాచవరంతో పాటు కొత్తపాలెం, మోర్జంపాడు, తదితర గ్రామాల నుండి మహిళలు, డ్వాక్రా సిబ్బంది ఆర్‌టిసి బస్సులో గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద జరిగిన ప్రమాణస్వీకారోత్సవానికి తరలివెళ్లారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, మంత్రులుగా పవన్‌కల్యాణ్, తదితరులు ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద పేదలకు పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు రామిశెట్టి శ్రీనివాసరావు, కొన్నం రామయ్య, మంగళగిరి కోటేశ్వరరావు, గరికపాటి మోహన్‌రావుల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ కార్యక్రమం జరిగింది.

మాచర్లలో పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ మాచర్ల ఇన్‌చార్జి డాక్టర్ యరమల

మాచర్లటౌన్, జూన్ 12: మాచర్ల నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు పాలకులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం, స్థానికంగానూ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఇకనైనా మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విద్య, ఉపాధి కల్పనకు పెద్ద పీట వేయాలని సూచించారు. సమావేశంలో షేక్ బాబు, వంగపాటి నాగరాజు, షేక్ షకీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్షయ నివారణా వ్యాక్సిన్ అందజేత


రెంటచింతల,జూన్ 12 : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం క్షయ నివారణా వ్యాక్సిన్ వేయనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారిలో షుగర్ వ్యాధిగ్రస్థులు, ధూమపానం అలవాటున్న వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చని అన్నారు. గ్రామాల్లోని సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో ఈ వ్యాక్సిన్‌ను అందజేస్తారని తెలిపారు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

నకరికల్లు, జూన్ 12 : సాధారణ ఎన్నికల సమయంలో గుండ్లపల్లి గ్రామంలో జరిగిన దాడి ఘటనకు సంబంధించిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కే నాగేంద్రరావు తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించారన్నారు.

బీఎల్‌వోలకు ఎన్నికల వేతనం ఇవ్వాలి

సత్తెనపల్లి, జూన్ 12 : ఎన్నికల సందర్భంగా రెండు రోజులు విధులు నిర్వహించిన బీఎల్‌వోలకు అధికారులు వెంటనే ఎన్నికల వేతాన్ని అందజేయాలని న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల విధులు నిర్వహించి నెల రోజులు పూర్తవుతున్నా బీఎల్వోలకు ఇంతవరకు రెమ్యునరేషన్ అంద లేదన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ఆయా నిధులను విడుదల చేయాలని కోరారు.



మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను లైటింగ్‌తో అలంకరించిన దృశ్యం

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నూతన వెలుగులు

మాచవరం, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రంగురంగుల విద్యుత్ కాంతులతో అలంకరించారు. జిల్లా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి నుండి విద్యుత్ వెలుగులలో సబ్‌స్టేషన్‌ను అలంకరించినట్లు ఏఈ పెదమస్తాన్ బుధవారం తెలిపారు.



సత్తెనపల్లి రామాలయంలో పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

టీడీపీ నేతల మొక్కు చెల్లింపులు

సత్తెనపల్లి, : అమరావతి రాజధానిగా కొనసాగాలని, చంద్రబాబు నాయుడు సీఎం కావాలని స్థానిక రామాలయం, శివాలయంలలో మొక్కుకున్న టీడీపీ నేతలు బుధవారం వారి మొక్కులను చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉద్యోగ కల్పన, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణంతో పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యేగా కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోతుగంటి రామకోటేశ్వరరావు, ప్రత్తిపాటి హరేకృష్ణ, దివ్వెల శ్రీను, కే నాగమల్లేశ్వరరావు, జక్కుల శ్రీనివాసరావు, రాంబాబు, జీ. శ్రీనివాసరావు, సుమన్, ఎం శ్రీనివాసరావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, యరపతినేని శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలవాలని దేవుడిని మొక్కుకున్న ఆ పార్టీ శ్రేణులు, వారి కోరిక నెరవేరడంతో బుధవారం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం వరకు పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకున్నారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన తుమ్మల నారాయణ భార్య అచ్చమ్మ, తుమ్మల వెంకట్రామయ్య భార్య ధనలక్ష్మీలు తంగెడ గ్రామం నుంచి మట్టపల్లి దేవస్థానం వరకు పాదయాత్ర పూర్తిచేశారు. అనంతరం దేవాలయంలో స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. 200 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు.

శపథం నెరవేరింది ..

నకరికల్లు: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావటంతో నకరికల్లు మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు దాచేపల్లి రంజాన్ షరీఫ్ బుధవారం తల నీలాలు సమర్పించుకున్నాడు. 2019లో టీడీపీ ఓటమి పాలవ్వటంతో 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు సత్తెనపల్లి నియోజక వర్గంలో టీడీపీ జెండా ఎగుర వేసిన రోజు తాను తల నీలాలు సమర్పించుకుంటానని రంజాన్ షరీఫ్ శపథం చేశాడు. కూటమి విజయం సాధించటంతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం, కన్నా లక్ష్మీనారాయణ భారీ మెజార్టీతో గెలుపొందటంతో రంజాన్ షరీఫ్ బుధవారం తల నీతాలు సమర్పించుకున్నాడు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో పదేళ్ళపాటు తల నీలాలు, గడ్డంను పెంచి 2014లో తల నీలాలు సమర్పించుకున్నాడు.

మిన్నంటిన అభిమానం



పిడుగురాళ్లలో యరపతినేని శ్రీనివాసరావు, లావు శ్రీకృష్ణదేవరాయలుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన భారీ కటౌట్

పిడుగురాళ్ల, జూన్ 12: గురజాల నియోజకవర్గ శాసనసభుడిగా ఎన్నికైన యరపతి నేని శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతూ పట్టణంలోని పలు ప్రాంతాలలో పార్టీ శ్రేణులు భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులకు అభినందనలు తెలుపుతూ పల్నాడులో భారీ ఎత్తున ఫ్లెక్సీలు వెలిశాయి. ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలు యరపతినేని శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాచర్లటౌన్: మాచర్ల పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి భారీ కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు బాబుఖాన్ 30 అడుగుల ఎత్తు, 10 అడుగుల వెడల్పుతో కటౌట్ ఏర్పాటు చేశారు. ఈ కటౌట్‌ను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



మాచర్లలో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన భారీ కటౌట్

పంచాయతీలకు మంచి రోజులు

రెంటచింతల,జూన్ 12: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాల్గవసారి ప్రమాణ స్వీకారంచేయడంతో అభివృద్ధిలో అధోగతిపాలైన పంచాయతీలకు ఇక నుంచి మంచి రోజులు వచ్చినట్లేనని పాలువాయి గ్రామ సర్పంచ్ మందలపు విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఉంటే రాష్ట్రంలో పంచాయతీలు నాశనమై ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలేదన్నారు. సర్పంచ్ హక్కులను కాలరాసి 14, 15 ఆర్థిక సంఘ నిధులను దారి మళ్లించిన జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో మందలపు హనిమిరెడ్డి,సొసైటీ మాజీ ఛైర్మన్ కోటిరెడ్డి,పాశం రామ కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అమరావతి, జూన్ 12: మండల పరిధిలోని మల్లాది ఇసుక రీచ్ నుంచి అక్రమంగా క్వారియింగ్ చేసి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదే గ్రామం నుంచి నాలుగురోజుల క్రితం పట్టుబడ్డ ట్రాక్టర్‌ను వదలివేసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా మల్లాది గ్రామం నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్న వైసీపీ నేతలు ప్రభుత్వం మారినప్పటికీ ఏమాత్రం తగ్గకుండా ఇసుకను తరలిస్తూనే ఉన్నారు.

విద్యుదాఘాతంతో పశువుల కాపరి మృతి

దుర్గి,జూన్ 12: విద్యుదాఘాతంతో పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని శ్యామరాజుపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మేకల సురేష్ (19) పశువులు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే బుధవారం పశువులు మేపేందుకు దగ్గరలోని బీడు భూమి వెళ్ళాడు. పక్కనే ఉన్న పొలంలో బోరు కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారం వద్దకు వెళ్ళాడు. అక్కడ విద్యుత్ తీగ ఒకటి వేలాడుతండగంతో దానిని గమనించని సురేష్ ఆ తీగను తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికి అక్కడే మృతి చెందారు. సురేష్ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కోటయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలపారు.



ఆటోలో పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్న విద్యాశాఖ అధికారులు

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు తరలింపు

అమరావతి, జూన్ 12: పాఠశాలలు పునఃప్రారంభం అయిన సందర్భంగా ఈనెల 13వ తేదీ నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సంబంధిత పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను, విద్యాకానుక కిట్‌లను తరలిస్తున్నారు. బుధవారం స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో సిద్ధం చేసిన పాఠ్యపుస్తకాలను వివిధ పాఠశాలలకు తరలించారు. మండల విద్యాశాఖ అధికారి శివబాబు పర్యవేక్షణలో పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్నారు. కార్యక్రమంలో సిఆర్‌పీలు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేశారని దాడి..

- వైసీపీ మూకల ఘాతుకం.. నలుగురికి గాయాలు..

దుర్గి, జూన్ 12 : వైసీపీ భారీ వైఫల్యం చూసినప్పటికీ వైసీపీ అల్లరి మూకల దాడులు ఏమాత్రం తగ్గడం లేదు. పల్నాడు జిల్లా దుర్గి మండల పరిధిలోని ఆత్మకూరులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వైసీపీ అల్లరి మూకలు అదే సామాజిక వర్గానికి చెందిన చల్లగుండ్ల సామ్యేలు, ఎండూరి పిచ్చయ్య కొమ్ము నవీన్, ఎండూరి రాజేష్‌పై బుధవారం ఉదయం విచక్షణా రహితంగా కర్రలు, మారణాయుధాలతో దాడులు చేశారు. ఈ దాడిలో చల్లగుండ్ల సామ్యేలు తలకు తీవ్ర గాయం కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. మూడు ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమాచారం తెలుసుకున్న దుర్గి ఎస్ఐ కోటయ్య సంఘటనా స్థలానికి చేరుకొని గొడవకు గల కారణాలు తెలుసుకున్నారు. దాడులు చేసిన వారిలో ఎలకపాటి చిన సుందరం, శ్రీను, నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, జాషువా, మరియదాసు, ఎండూరి నజిరి, ఏసుదానం, ఎలకపాటి సుందరరావు పాల్గొన్నట్లు బాధితులు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం నుంచి తమపై దూషణలకు దిగుతున్నారని ఆరోపించారు. చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. బాధితులు దుర్గి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటయ్య తన సిబ్బందితో ఆత్మకూరుకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. సంఘటనా వివరాలను తెలుసుకొని కేసు నమోదు చేశారు. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం దుర్గి పీహెచ్‌సీకి తరలించారు.

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార సంబరాలు

● బాణసంచా కాల్చి, మిఠాయిల పంపిణీ



మిఠాయిలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 12: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, నారా లోకేశ్, మిగతా మంత్రి వర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టైలర్ మస్తాన్, సయ్యద్ ఆలీ, సయ్యద్ గౌస్, మేస్త్రీ మస్తాన్‌వలి, పఠాన్ సుభాని, కరీమ్, మొహమ్మద్, జానీ, పీర్ బాషా, అల్లా, సాయి, ఖాజా, భార్గవ్ కోటయ్య, కొండ, రహమాన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డుల్లో సంబరాలు.. ఇంటింటికి లడ్డు పంపిణీ



6వ వార్డులో ఇంటింటికి తిరిగి లడ్డు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వినుకొండటౌన్, జూన్ 12: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవం, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా పట్టణంలోని 6వ వార్డులో టీడీపీ నాయకులు గంధం కోటేశ్వరరావు, సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి తిరిగి లడ్డు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మంచి రోజులు రానున్నాయని, ఉద్యోగావకాశాలతో పాటు, పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందనున్నాయని తెలియజేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

గ్రామాల్లో పండుగ వాతావరణం



చిలకలూరిపేట 10, 11 వార్డుల్లో స్వీట్లు పంచుకుంటున్న మహిళలు

చిలకలూరిపేట, జూన్ 12: నియోజకవర్గంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రమాణ స్వీకారోత్సవం చేస్తున్న సందర్భంగా పట్టణంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం సందడి వాతావరణం నెలకొంది. అన్ని గ్రామాల్లో బాణసంచా కాల్చి పండుగ చేసుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు. కొన్ని గ్రామాల్లో భోజనాలు పెట్టుకున్నారు. పట్టణంలోని అపార్ట్‌మెంట్లలో కూడా సందడి వాతావరణం నెలకొన్నది. ఎంతో ఉత్సాహ భరిత వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని ఐక్యంగా కొనసాగించారు. పట్టణంలోని 10, 11 వార్డులకు చెందిన మహిళలు ఆ వార్డు ప్రజలకు స్వీట్లు పంచి తమ ఆనందాన్ని తోటి వారితో పంచుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్ని ప్రధాన సెంటర్లలో బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వ ఏర్పాటు సందర్భంగా టీ ఫ్రీ



సీఎం ప్రమాణ స్వీకారం సందర్భంగా సద్దాం టీ స్టాల్లో టీ ఫ్రీ

వినుకొండ, జూన్ 12: నవ్యాంధ్రప్రదేశ్ మూడో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబుతో పాటు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పల్నాడు రోడ్డులోని సద్దాం టీస్టాల్ యజమాని షేక్ సద్దాం బుధవారం తెల్లవారుజాము నుంచి తన టీ స్టాల్ వద్దకు వచ్చే తేనీరు ప్రియులకు టీని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుమ్మడి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు షేక్ దస్తగిరి, యువ నాయకులు లింగ య్య యాదవ్, ఆంజి తదితరులు పాల్గొన్నారు.

ఊరు.. వాడా పసుపు జాతర

● జిల్లా అంతటా సంబరాలు

● సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవం ఎల్‌ఈడీ స్క్రీన్‌పై వీక్షణ



సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రసారం

నరసరావుపేట, జూన్ 12: తెలుగుదేశం కూటమి అతి పెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. జిల్లాలోని అన్ని స్థానాల్లో తెలుగుదేశం ఘన విజయాన్ని నమోదు చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగో సారి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌తో పాటు పలువురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అంతటా ఊరు.. వాడా పసుపు జాతర నెలకొంది. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పండగలా జరుపుకున్నారు. టీడీపీ శ్రేణులు మిఠాయిలు పంపిణీ చేశాయి. వాడవాడలా.. గ్రామాల్లో పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. మహిళలు సైతం పార్టీ పతాకాలను చేతబూని రోడ్లపైకి వచ్చి ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. భారీ కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సైకో జగన్ పీడ రాష్ట్రానికి వదిలిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిల్లాలో టీడీపీ శ్రేణుల సంబరాలు అంబరానంటాయి. యవకులు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ప్రమాణ స్వీకారోత్సవాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు కుటుంబ సభ్యులతో కలసి జరుపుకున్నారు.

భారీ ఎల్‌ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు

నరసరావుపేట పట్టణంలోని భువన చంద్ర టౌన్ హాల్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని లైవ్ ద్వారా వీక్షించారు. కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్, జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తరితరులు చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. అలాగే జిల్లా లోని నియోజకవర్గ కేంద్రాల్లో బారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రసారం చేశారు. కూటమి శ్రేణులు, చంద్ర బాబు, పవన్ కళ్యాన్ అభిమానులు అధిక సంఖ్యలో ఈ స్క్రీన్స్ వద్ద ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించారు.



నరసరావుపేటలో భువనచంద్ర టౌన్ హాల్లో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ బీ లత్కర్, జేసీ ఏ శ్యామ్‌ప్రసాద్, పట్టణ వాసులు

వినుకొండ జాషువా కళాప్రాంగణంలో

వినుకొండటౌన్, జూన్ 12: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన శుభ తరుణాన అభిమాన నాయకుల ప్రమాణ స్వీకారం మహోత్సవ ఘట్టాన్ని ప్రజలంతా వీక్షించేందుకు పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల వద్ద బుధవారం పండుగ వాతావరణం నెలకొంది. నవ్యాంధ్రప్రదేశ్ మూడో ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, మంత్రులుగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నారాలోకేష్, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారాలను నేరుగా హాజరయ్యే అవకాశం లేక పోయినా స్థానికంగా భారీ తెరలపై చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఈమేరకు బుధవారం పల్నాడు జిల్లా వినుకొండలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పట్టణ ప్రజలు చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరలపై వీక్షించారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలో

చిలకలూరిపేట, జూన్ 12: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గ్రాండ్ వెంకటేశ్వర కల్యాణ మండపంలో అధికారులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు వీలుగా భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. తిరుపతి, చిత్తూరు, సత్యసాయి జిల్లాకు చెందిన కార్యకర్తలకు నాలుగు కల్యాణ మండపాలు, హాస్టళ్లల్లో పలు వసతులతో పాటు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. యడ్లపాడు మండలం జగ్గాపురంలో పోపూరి కల్యాణ మండపంలో పోపూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సుమారు 450మందికి పైగా గ్రామస్థులు కల్యాణ మండపంలో కూర్చొని ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించారు. టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, పోపూరి శ్రీనివాసరావు, పోపూరి భైరవ్, ముద్దన అనీల్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కరోనాలోనూ కక్కుర్తి

● రూ.42 లక్షలు పక్కదారి

● నరసరావుపేట మున్సిపాల్టీలో మరో అవినీతి దందా

నరసరావుపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మున్సిపల్ కార్యాలయంలో మరో అవినీతి దందా వెలుగుచూసింది. కరోనాలోనూ కక్కుర్తిపడ్డారు. రూ.42 లక్షలు పక్కదారి పట్టాయి. కరోనా విజృంభించిన నేపథ్యంలో ప్రజలు భీతిల్లిపోతే కొందరు అక్రమార్కులు మాత్రం మున్సిపల్ నిధులను కాజేసినట్టు తెలిసింది. ఈ ఫైళ్లపై సంతకం పెట్టాలని ఒక కమిషనర్‌ను బెదిరించినట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. క్వారంటైన్ పనులు చేయకుండానే నిధులు స్వాహా చేయడంలో ఓ అధికారి కీలక పాత్ర పోషించారు. వైసీపీ నేతలకు ప్రజాధనాన్ని దోచిపెట్టారు. ఇందుకు సంబంధించిన ఫైళ్లు ఇప్పుడు కార్యాలయ వర్గాల ద్వారా వెలుగు చూశాయి. ఇలాంటి దందాలు అనేకం జరిగినట్టు కార్యాలయ వర్గాలు చెప్పకనే చెబుతున్నాయి. వైసీపీ నేతలతో కుమ్మక్కై మున్సిపల్ నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించారని కార్యాలయ ఉద్యోగులు కోడై కూస్తున్నారు. నాడు వైసీపీ అధికారంలో ఉండటంతో నిధుల స్వాహాపై ప్రశ్నించిన అధికారులను ఇక్కడ నుంచి సాగనంపిన విషయం తెలిసిందే. కార్యాలయ వర్గాల గొంతును కూడా అక్రమార్కులు నొక్కేశారు. అడ్డు అదుపు లేకుండా అక్రమాలను కార్యాలయంలో సాగించారు.

ఇంజనీరింగ్ విభాగంలో ఫైలు మాయం

మరో అక్రమానికి సంబంధించిన ఫైలు మాయమైనట్టు విశ్వసనీయ సమాచారం. వ్యర్థాల సేకరణ ప్రైవేటీకరణకు సంబంధించిన ఫైలును కనపడకుండా చేసినట్టు తెలిసింది. ఈ విషయమై పారిశుధ్య విభాగం అధికారులను సదరు పనులపై వివరణ కోరగా వ్యర్థాల సేకరణకు సంబంధించిన పనులను ఇంజనీరింగ్ విభాగం ప్రైవేటీకరించిందని తెలిపారు. ఆస్పత్రులు, హోటళ్లు, కల్యాణమండపాలు, రెస్టారెంట్లు, హాస్టల్స్ బహుళ అంతస్తుల భవనాల నుంచి ప్రతి రోజు వ్యర్థాల సేకరణ చేస్తారు. ఈ పనులను ప్రైవేటీకరంచారు. వైసీపీ నేతకు ఈ టెండర్‌ను ఇంజనీరింగ్ విభాగం కట్టబెట్టింది. మున్సిపాల్టీ నిర్ణయించిన రేట్ల మేర చెత్త సేరణకు సదరు కాంట్రాక్టర్ వసూలు చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన పనివారు, వాహనాలను సదరు కాంట్రాక్టర్ సమకూర్చుకున్నాడు. కాగా వ్యర్థాల పనులు అప్పగించేందుకు టెండర్ పద్ధతిలో మున్సిపాల్టీకి కొంత సొమ్ము చెల్లించాలి. ఈ సొమ్ము వసూలు చేసే విషయంలో ఒక కమిషనర్‌ను ఇక్కడ నుంచి బదిలీ చేయించారని కార్యాలయ వర్గాలు తెలిపాయి. సదరు కాంట్రాక్టర్ మున్సిపాల్టీకి సొమ్ము చెల్లించాడా, లేదా మున్సిపాల్టీ కాంట్రాక్టర్‌కు చెల్లించిందా, అసలు టెండర్ నిర్వహించారా, ఇంజనీరింగ్ విభాగం ఎటువంటి నిబంధనలు పాటించకుండా ఐదేళ్లు పనులు కట్టబెట్టిందా అనే ప్రశ్నలపై సదరు అధికారులు నోరు మెదపడంలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఆ ఫైలు బయట పెట్టి ఐదేళ్ల నుంచి జరిగిన వ్యర్థాల సేకరణ ప్రైవేటీకరణపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. కొందరు అధికారులు వైసీపీ నేతలకు ప్రజాధనాన్ని దోచి పెట్టిన తీరు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తుండటంతో కార్యాలయ వర్గాలు ఖంగుతింటున్నాయి.



నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం

ప్రభుత్వం ఏర్పాటుతో పార్టీ శ్రేణుల ఆనందోత్సాహాలు



పాల ఉప్పలపాడులో 100 కేజీల కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



వీ అప్పాపురంలో కోలాట ప్రదర్శన

నూజెండ్ల, జూన్ 12 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు బుధవారం జరుపుకున్నారు. మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించా రు. అదే విధంగ పాత ఉప్పలపాడు గ్రామంలో వంద కేజీల కేక్ కట్ చేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వీ అప్పాపురం గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు నక్కా బుల్లీశ్వరరెడ్డి, రొడ్డా వీరాంజనేయరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, రొడ్డా నారాయణరెడ్డి, బత్తుల గోవిందరాజులు, నంబుల పాపారావు, మారెళ్ళ నారాణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు



పాఠశాలలకు పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంఈవో

రొంపిచర్ల, జూన్ 12: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ల కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. స్థానిక జడ్పీ పాఠశాలలో మండలానికి సంబంధించిన కిట్లను దిగుమతి చేసుకున్నారు. 2024 - 25 విద్యా సంవత్సరానికి 4399 మంది విద్యార్థులకు పుస్తకాలు వచ్చాయి. ఈనెల 13వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీటిని పాఠశాలలకు పంపించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్లలో పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి

● కాంగ్రెస్ పార్టీ మాచర్ల ఇన్‌చార్జి డాక్టర్ యరమల

మాచర్లటౌన్, జూన్ 12: నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు పాలకులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం, స్థానికంగానూ జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపొందడంతో ఇకనైనా మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అమరావతి, జూన్ 12: మండల పరిధిలోని మల్లాది ఇసుక రీచ్ నుంచి అక్రమంగా క్వారియింగ్ చేసి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదే గ్రామం నుంచి నాలుగురోజుల క్రితం పట్టుబడ్డ ట్రాక్టర్‌ను వదలివేసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా మల్లాది గ్రామం నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తర లించి సొమ్ము చేసుకున్న వైసీపీ నేతలు ప్రభుత్వం మారినప్పటికీ ఏమాత్రం తగ్గకుండా ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. మల్లాదిలో ఇసుక అక్రమరవాణా నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

బీఎల్‌వోలకు రెమ్యునరేషన్ ఇవ్వాలి

సత్తెనపల్లి, జూన్ 12 : ఎన్నికల విధులు రెండు రోజులు నిర్వహించిన బీఎల్‌వోలకు వెంటనే అధికారులు రెమ్యునరేషన్ ఇవ్వాలని న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల విధులు నిర్వహించి నెల రోజులు పూర్తవుతున్నా బీఎల్వోలకు ఇంతవరకు రెమ్యునరేషన్ అందలేదన్నారు. ఈ విష యమై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ఆయా నిధులను విడుదల చేయాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి

● జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్



బాలలతో కలసి ర్యాలీలో పాల్గొన్న జేసీ శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో వినాయకం

నరసరావుపేట రూరల్, జూన్ 12: పల్నాడు జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలోని శంకరభారతి పురం హైస్కూలు నుంచి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి ఆర్ వినాయకం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని తెలిపారు. విద్యార్థులతో కలసి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లాలో బాల కార్మికుల సమాచారం తెలిస్తే 1098, 112, 100 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు డి.శౌరిరాజు, వై ప్రశాంత్‌కుమార్, కృష్ణారెడ్డి, ప్రశాంతి, కె.శ్రీనివాసరావు, బారత్ స్కౌట్స్ గైడ్స్ విభాగం నుంచి ఎం కృష్ణయ్య, పమ్మి వెంకటరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు ఎస్‌కే ఫాతిమా, ప్రధానోపాధ్యాయిని పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయిని రూసీరాణి, అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన టీడీపీ శ్రేణులు

నరసరావుపేట రూరల్, జూన్ 12: తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కృష్ణా జిల్లా గన్నవరం వద్ద గల కేసరపల్లిలో బుధవారం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో నరసరావుపేట మండలం నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నరసరావుపేట మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు కార్యకర్తలు నరసరావుపేటకు చేరుకుని అక్కడ నుంచి ర్యాలీగా కృష్ణా జిల్లా గన్నవరం వద్ద గల కేసరపల్లి సభాస్థలికి తరలి వెళ్లారు.

టీడీపీ శ్రేణుల మొక్కు చెల్లింపు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 12: చిలకలూరపేటలో ప్రత్తిపాటి పుల్లారావు భారీ మెజార్టీతో గెలుపొందడాన్ని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక 38వ వార్డులోని గంగమ్మ తల్లి దేవస్థానంలో టీడీపీ నాయకులు బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జంగా వినాయకరావు, 38వ వార్డు కౌన్సిలర్ జంగా సుజాత, మహిళా నాయకులు పోపూరి లక్ష్మి, జరీనా సుల్తానా వీరితో పాటు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెస్సీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూన్ 12: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎమ్మెసీ కంప్యూటర్స్, కెమిస్ట్రీ నాలుగో సెమిస్టర్‌లో కృష్ణవేణి డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్స్‌లో కే శ్రీలక్ష్మీ, పీ ఆష్మా బేగమ్, కే వెంకటసాయి ప్రియ అత్యధిక మార్కులు సాధించారన్నారు. కేమిస్ట్రీలో ఆర్ శ్రీవల్లి, కే నివేదిత కాత్యాయిని, ఎం అనూష, ఎస్‌కే అఫ్రిన్ హసన్‌లు అత్యధిక మార్కులు సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను డైరెక్టర్లు కే నాసరయ్య, కంప్యూటర్ విభాగాధిపతి టీ సురేఖ, కెమిస్ట్రీ విభాగాధిపతి డీ యోగేశ్వరరావు, వై శ్రీకాంత్, కే అప్పర, డీ చెన్న కేశవరావు, కే వినయ్‌కుమార్, జీ చంద్ర అభినందించారు.

నేడు విప్పర్ల వల్లభేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



విప్పర్లలో ఉన్న వల్లభేశ్వర స్వామి

రొంపిచర్ల, జూన్ 12 : మండలంలోని విప్పర్ల గ్రామంలో వల్లభేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం నేడు నిర్వహించనున్నట్టు భక్త బృందం బుధవారం తెలిపింది. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణతో పాటు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది.

పాఠశాలలకు చేరిన పుస్తకాలు



12బొల్లాపల్లి1, పుస్తకాల పంపిణీ చేస్తున్న ఎంఈవో పార్వతి

బొల్లాపల్లి, జూన్ 12 : వేసవి సెలవుల అనంతరం నేటి నుంచి స్కూళ్ళు పునఃప్రారంభమవుతున్నట్టు ఎంఈవో పార్వతి బుధవారం తెలిపారు. ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాలను ఆయా స్కూళ్ళకు పంపిణీ చేశారు. కస్తూర్బా పాఠశాలకు, ఏపీ మోడల్ స్కూల్, బొల్లా పల్లి జడ్పీ పాఠశాలకు పుస్తకాలు, స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ఖాశింవలి, జేమ్స్ నాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

అనారోగ్యంతో రామకోటి మాష్టారు మృతి

నరసరావుపేట రూరల్, జూన్ 12: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ బాలుర హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రామకోటి మాష్టారు బుధవారం మరణించారు. నరసరావుపేట పట్టణంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటుగా నరసరావుపేట పట్టణంలో బ్యాంకు కోచింగ్ ఏర్పాటు చేసి ఎందరో విద్యార్థులను బ్యాంకు అధికారులుగా తీర్చిదిద్దిన ఘనత రామకోటి మాష్టారుకే దక్కుతుంది. బుధవారం మాష్టారు మరణవార్త విని పల్నాడు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎం సుబ్బారావు, మాధవ రెడ్డి, అప్పిరెడ్డి, రంగనాయకులు, కె.అప్పారావు తదితరులు రామకోటి మాష్టారుకు పూలమాల వేసి నివాళులర్పించారు.

పంచాయతీలకు మంచి రోజులు

రెంటచింతల,జూన్ 12: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాల్గవసారి ప్రమాణ స్వీకారం చేయడంతో అభివృద్ధిలో అధోగతిపాలైన పంచాయతీలకు ఇక నుంచి మంచి రోజులు వచ్చినట్లేనని పాలువాయి గ్రామ సర్పంచ్ మండలపు విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఉంటే రాష్ట్రంలో పంచాయతీలు నాశనమై ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలేదన్నారు. సర్పంచ్ హక్కులను కాలరాసి 14, 15 ఆర్థిక సంఘ నిధులను దారి మళ్లించిన జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. మాచర్ల నియోజకవర్గ ఓటర్లు ఈ దఫా విజ్ఞతతో ఆలోచించి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. సమావేశంలో మండలపు హనిమిరెడ్డి,సొసైటీ మాజీ ఛైర్మన్ తేలుకుట్ల కోటిరెడ్డి,పాశం రామకోటిరెడ్డి పాల్గొన్నారు.